క్లుప్తంగా

నేటి నుంచి అశిరాంబ అమ్మవారి జాతర


శ్రీఅశిరాంబ అమ్మవారు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామదేవత అశిరాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ నాయకుడు రాగం రామచంద్రరావు శనివారం తెలిపారు. అమ్మవారి జాతరను అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామ ఆడపడుచులు జాతరకు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివారం పెద్ద జాతర, 29న ఆలయం వద్ద తీర్థము 30న నైవేద్య సమర్పణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

215 ఆధార్ సమస్యల పరిష్కారం


రాయవరం ఆధార్ కేంద్రంలో సమస్యలను పరిష్కరిస్తున్న సిబ్బంది

రాయవరం: మండలంలోని వెదురుపాక, చెల్లూరు గ్రామాల సచివాలయాల పరిధిలో ఆధార్ నవీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వెదురుపాక సచివాలయం పరిధిలో నదురుబాద, పసలపూడి, రాయవరం గ్రామాలకు చెందిన 101 మంది ఆధార్ సమస్యలను పరిష్కరించారు. అలాగే చెల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో మాచవరం, కూర్మాపురం, కురకాళ్లపల్లి, చెల్లూరు, వెంటూరు గ్రామాల పరిధిలో 114 మంది ఆధార్ సమస్యలను పరిష్కరించారు. రెండు చోట్ల ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల పరిధిలో మొత్తం 215 మంది ఆధార్ సమస్యలను నవీకరించినట్లు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

తాపేశ్వరం హైస్కూల్లో 'మిషన్ శక్తి'


తాపేశ్వరంలో చట్టాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి, సింహాచలం

మండపేట: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ శక్తి కార్యక్రమాన్ని శనివారం తాపేశ్వరం హైస్కూల్లో నిర్వహించారు. ఐసీడీఎస్ తాపేశ్వరం సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి, మండపేట సెక్టార్ సూపర్‌వైజర్ సింహాచలం ఆధ్వర్యంలో బాలికలకు, వారి తల్లులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా గుడ్ టచ్ .. బ్యాడ్ టచ్, ఉమెన్ ట్రాఫికింగ్, బాల్య వివాహాలు ఎందుకు చేసుకోకూడదు, వాటి వల్ల వచ్చే అనర్థాలు వంటి అంశాలను బాలికలకు, వారి తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హైస్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలి దశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శనివారం మండలంలోని బందనపూడి, గొల్లపాలెంలలో వ్యవసాయాధికారి పర్యటించారు. బందనపూడిలో ఏఓ మాట్లాడుతూ వరిసాగులో పంట తొలి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన లాభాలు పొందవచ్చన్నారు. ప్రస్తుతం మండల గ్రామాల్లో రైతులు నారుతీసి నాట్లువేసే విధానానికి బదులు ఎక్కువగా వెదజల్లు విధానం అవలంభిస్తున్నారని ఈ విధానం మెలైనదే అయినప్పటికి కలుపు తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు.

స్టూడెంట్ కిట్లు సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న దృశ్యం

కె.గంగవరం: ప్రభుత్వం ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్న స్టూడెంట్ కిట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చీకట్ల సునీత అన్నారు. మండలంలోని పాణింగపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం వారు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నారని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని చదువులు రాణించి మంచి ఉద్యోగాలు సాధించాలన్నారు. సీనియర్ హెచ్‌ఎం పుల్లయ్య, టీడీపీ నాయకులు కొత్తపల్లి మురార్జీ, బలుసు నాగేంద్ర, వైట్ల సాయి, కమ్మ రాంబాబు, వైట్ల రామకృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుష్ఠు నియంత్రణే లక్ష్యంగా..


సర్వే చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

- ఈ నెల 18న ప్రారంభమైన ఎల్సీడీసీ సర్వే
- ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది
- వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స

రాయవరం: కుష్ఠు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైద్యఆరోగ్య శాఖ అధికారులు సర్వే చేపట్టారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్సీడీసీ) పేరుతో 14 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం (ఎన్ఎస్ఈపీ) ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీ వరకూ కొనసాగుతుంది. క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో రామచంద్రపురం, మండపేట పట్టణాలతో పాటుగా ఐదు మండలాల్లో సమగ్రంగా సర్వే నిర్వహిస్తున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో 4,27,712 మంది జనాభా ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపడుతున్నారు.

టీములుగా ఏర్పడి..

రామచంద్రపురం, మండపేట నియెజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లో 17 ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మండలాలవారీగా కె.గంగవరంలో 80,225, రామచంద్రపురంలో 1,01,087, కపిలేశ్వరపురంలో 57,371, మండపేటలో 1,27,852, రాయవరంలో 61,177 మంది జనాభా ఉన్నారు. క్లస్టర్‌లోని 17 పీహెచ్‌సీల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను టీమ్‌లుగా ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో ఒక ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, వైద్య సిబ్బంది మొత్తం ముగ్గురు ఉంటారు. ఈ టీమ్ తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి మచ్చలను పరిశీలిస్తారు. కొత్త కేసులను గుర్తించి వారికి పూర్తి స్థాయిలో వైద్యం అందిస్తారు. ప్రాథ మిక దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందిస్తే అంగ వైకల్యం రాకుండా నిరోధించవచ్చని వైద్యులు చెబుతున్నారు. క్లస్టర్‌లో ఇప్పటి వరకూ 20 మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఉన్నట్టు వైద్యాధికారులు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశానుసారం 10 వేల జనాభాకు ఒక్కరు మాత్రమే కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఉండాలి. ప్రస్తుతం జరుగుతున్న సర్వే ద్వారా అనుమానిత లక్షణాలున్నవారిని గుర్తిస్తున్నారు. వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

మండలంలోని పీహెచ్‌సీల వారీగా జనాభా, కేసుల వివరాలు

మండలం	పీహెచ్‌సీ	జనాభా	పీబీ	ఎంబీ	మొత్తం
కె.గంగవరం	దంగేరు	18386	00	01	01
	కుందూరు	21114	01	02	03
	పేకేరు	18806	01	00	01
	పామర్రు	21919	01	01	02
ఆర్‌సీపురం	ద్రాక్షారామ	33528	00	01	01
	వెల్ల	24599	00	01	01
	కోట	21760	01	01	02
	ముచ్చిమిల్లి	21200	00	01	01
కపిలేశ్వరపురం	వాకతిప్ప	17851	02	02	04
	అంగర	21405	00	00	00
	అచ్యుతాపురం	18115	00	01	01
మండపేట	గొల్లపుంత	24322	00	00	00
	పెదహరిజనపేట	29538	00	01	01
	ద్వారపూడి	50886	00	01	01
	డి.కేశవరం	23106	00	00	00
రాయవరం	మాచవరం	34809	00	00	00
	రాయవరం	26368	00	01	01

వ్యాధి లక్షణాలు

- చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చెవులపై బుడిపెలు, కణుతులు, నరాల తిమ్మిర్లు
- మందమైన మెరిసే జిడ్డు గల చర్మం
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కనురెప్పలు మూత పడకపోవడం. చేతులకు, కాళ్లకు బొబ్బలు రావడం, కాలి చెప్పులు జారిపోవడం
- చేతి, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం. చల్లని, వేడి వస్తువులను గుర్తించకపోవడం, పాదాల్లో వాపు.
- ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం

ఉచితంగా చికిత్స

కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వారికి రెండు పద్ధతుల ద్వారా వైద్యసేవలు అందిస్తారు. శరీరంపై మూడు మచ్చలు ఉన్న వారికి పాసివ్ బ్యాసిలరీ (పీబీ) విధానంలో ఆరు నెలలు, అలాగే ఐదుకు పైబడి మచ్చలున్నవారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలల పాటు చికిత్స అందిస్తారు. ఇందులో భాగంగా నెలకు ఒకసారి ఆయా రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది మందులు అందజేస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధిపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించవచ్చు. 1987 తర్వాత బహుళ ఔషధ చికిత్స (మల్టీ డ్రగ్ థెరపీ) ద్వారా వ్యాధిని అరికడుతున్నారు. వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఉచితంగా అందిస్తున్నారు.

సకాలంలో చికిత్స తీసుకోవాలి



లెప్రసీ వ్యాధిని సకాలంలో గుర్తించి వారికి తగిన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్సీడీసీ సర్వే చేపట్టాం. సర్వే నిర్వహణకు ప్రజల సహకారం అవసరం. వైద్య సిబ్బంది ఏ ఒక్కరినీ వదలకుండా ప్రతి ఒక్కరినీ సర్వే చేయాలి. ఎటువంటి లక్షణాలు గుర్తించినా వెంటనే వైద్యాధికారులకు తెలియజేయాలి. వ్యాధిని తొందరగా గుర్తిస్తే సకాలంలో తగ్గించుకోవచ్చు.

– వి.అనిరుథ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

కలాం ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మాజీ రాష్ట్రపతికి పలువురి ఘన నివాళి


అబ్దుల్ కలాంకు నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, పట్టణ ప్రముఖులు

మండపేట: ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరున ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. భారతరత్న అబ్దుల్ కలాం 9వ వర్థంతిని పట్టణంలో ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు సభ్యులు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్‌పర్సన్ దుర్గారాణితో పాటు పట్టణ ప్రముఖులు వి. సాయికుమార్‌బాబు, కోన సత్యనారాయణ, కర్రి నారాయణరెడ్డి, ఇనపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్ఎన్) తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కలాం చిత్ర పటానికి వారు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరం డెల్టా హాస్పిటల్ వైద్య బృందం రోగులకు బీపీ, షుగరు, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 250 మంది వైద్య సేవలు పొందినట్టు ట్రస్టు చైర్మన్ షేక్ మౌలానా తెలిపారు. ప్రజలందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని మౌలానా, ట్రస్ట్ వైస్ చైర్మన్‌లు షేక్ చిన్న బదుల్లా ,షేక్ ఇబ్రాహీం పేర్కొన్నారు. కార్యక్రమంలో సల్మాన్ హుస్సేన్, అల్తాఫ్, కరీం, అమీర్ కమల్ ట్రస్ట్ సభ్యులు, మేనేజింగ్ ట్రస్టీ ఏఎస్ అతీఖ్, షేక్ మౌలాలి, షేక్ బాషా, ఎండీ రెహ్మాన్, ఆసుపత్రి వైద్యులు లోకేష్, సుధా, డీజీఎం గుమ్మల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పొలంబడి'ని సద్వినియోగం చేసుకోవాలి


వెల్లలో రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

రామచంద్రపురం రూరల్: పొలంబడి కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఏఎస్‌వీ రంగారావు సూచించారు. మండలంలోని వెల్లలో శనివారం నిర్వహించిన జీఏపీ పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పొలంబడి కార్యక్రమం నిర్వహించేటప్పుడు రైతులందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఎరువులను అవసరం మేరకే వేసుకోవాలని సూచించారు. మితిమీరిన ఎరువుల వాడకం వల్ల అనర్థాలు జరుగుతాయన్నారు. తొలకరి వరి పంటలో ఒక చదరపు మీటరుకి 33 కుదుళ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఏఓ ఎన్.సత్యప్రసాద్ మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంలో మంచి వ్యవసాయ పద్ధతులు అలవాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి


డీవైఈవో ఫణికి వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రామచంద్రపురం: పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా యూటీఎఫ్ శాఖ డీవైఈఓ శ్రీపాద నరసింహ ఫణికి పట్టణంలో శనివారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పి.సురేంద్రకుమార్, జిల్లా కార్యదర్శి రాయుడు శ్రీనివాస్ ఎం.ప్రదీప్‌కుమార్, తదితరులు డీవైఈఓతో మాట్లాడుతూ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జీవో 117ను రద్దు చేయాలని, ప్రీప్రైమరీతో పాటుగా 1 నుంచి 5వ తరగతులను ఒకే పరీక్షా విధానంలో అమలు చేయాలన్నారు. హైస్కూల్లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని కోరారు. హైస్కూల్ నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటరు పైబడి దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్న భోజనం పథకం మెను సవరించాలని, తదితర 20 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని డీవైఈఓకు వారు అందజేసినట్లు వారు తెలిపారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.రాజు, ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ శ్రీరామచంద్రమూర్తి, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి పీఎస్‌వీ రమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కట్టా శ్రీనివాస్, ఉపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణమూర్తి, ఎం.మాధవ, కె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వీర్రాజు చౌదరికి అరుదైన గౌరవం



ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చరల్ రీసర్చ్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న వీర్రాజుచౌదరి

కాజులూరు: మండలంలోని గొల్లపాలేనికి చెందిన పారిశ్రామికవేత్త చుండ్రు వీర్రాజు చౌదరికి అరుదైన గౌరవం దక్కింది. తమిళనాడు రాష్ట్రంలోని హోసూర్‌లో ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చరల్ రీసర్చ్ యూనివర్శిటీ శనివారం వీర్రాజు చౌదరికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి ఘనంగా సత్కరించింది. ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ ఫౌండర్ విజయాన్, అకాడమి మాస్టర్ వి.బాబువిజయాన్ తదితరుల చేతుల మీదుగా తాను డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నానన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం ద్వారా మానసిక ప్రశాంతత పొందటమే లక్ష్యంగా తాను పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేశానని అయితే వాటిని ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చరల్ రీసర్చ్ యూనివర్శిటీ గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మండల గ్రామాలకు చెందిన పలువురు స్థానిక నాయకులు, పెద్దలు వీర్రాజుచౌదరికి అభినందనలు వ్యక్తం చేశారు.

వరద బాధితులను ఆదుకుంటాం

మంత్రి వాసంశెట్టి సుభాష్


కోటిపల్లిలో వరద ముంపు గ్రామాల్లో పర్యటించిన మంత్రి సుభాష్

కె.గంగవరం: వరద ముంపు బాధితులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఎటువంటి భయాందోళనకు గురి కావద్దని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని కోటిపల్లిలో వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నిత్యావసరాలు అందజేసే కార్యక్రమాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం రూ.55 లక్షలతో ఏటిగట్లు గండి పడకుండా తాత్కాలిక చర్యలు చేపడుతున్నామన్నారు. వరద ప్రభావం తగ్గిన తరువాత రూ.140 కోట్లతో జిల్లా వ్యాప్తంగా గండ్లు పడే ప్రాంతాలుగా గుర్తించిన 13 చోట్ల శాశ్వత ప్రాతిపదికన ఏటిగట్లు పటిష్టపరిచే చర్యలు చేపడతామన్నారు. వరదల కారణంగా చేపల వేటకు దూరమైన మత్స్యకారులకూ వరద సహాయాన్ని అందజేస్తామన్నారు. అధికారులు వరదలపై అప్రమత్తంగా వ్యవహరించి ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టాలకు తావులేకుండా చర్యలు తీసుకున్నారని, వరద ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి లంక గ్రామాల్లో పశువులను రైతుల సహకారంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారని అన్నారు. వరద బాధితులకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎస్.సుధాసాగర్, ఎస్సై జానీ బాషా, రెవెన్యూ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్లను సందర్శించిన ఎస్పీ


పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ కృష్ణారావు

రాయవరం: జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు శనివారం రాయవరం పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆయన ఈస్టేషన్‌ను సందర్శించారు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ కె. శ్రీధర్‌కుమార్, ఎస్సై జి.నరేష్‌లు ఎస్పీ కృష్ణారావును ఘనంగా స్వాగతించారు. పోలీసుస్టేషన్‌ను ఎస్పీ కృష్ణారావు పూర్తిగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల వివరాలు, గ్రామాల్లో ఉన్న విశిష్టతలు, గ్రామాల జనాభా, గ్రామాల్లోని ఆలయాలు, గ్రామాల పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, సరిహద్దు గ్రామాల వివరాలు, స్టేషన్ పరిధిలోని కేసుల పురోగతి తదితర వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

రూరల్ స్టేషన్‌ను..

మండపేట: జిల్లా ఎస్పీ కృష్ణారావు శనివారం మండపేట రూరల్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్రైమ్ రేటు ఏ విధంగా ఉందని రూరల్ సీఐ కొమ్ముల శ్రీధర్‌కుమార్‌ను, ఎస్ఐ చైతన్యకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఎక్కడా గొడవలు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎస్పీ రామకృష్ణకు పలు సూచనలు చేశారు.

రామచంద్రపురం: కోనసీమ జిల్లా నూతనంగా ఎస్పీ బాధ్యతలు స్వీకరించిన బి.కృష్ణారావు రామచంద్రపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను శనివారం సందర్శించారు. రామచంద్రపురం పోలీస్ డివిజన్ పరిధిలోని అంశాలను డీఎస్పీ బి.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పనితీరుపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంచార్జ్ సీఐ శ్రీధర్ కుమార్, రామచంద్రపురం ఎస్సై సురేష్‌బాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అంగరలో..

కపిలేశ్వరపురం: వరద ప్రాంతాల్లో పోలీసు అధికారులు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశించారు. సాధారణ సందర్శనలో భాగంగా శనివారం రాత్రి మండలంలోని అంగర పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్థానిక పరిస్థితులను రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ శ్రీధర్, ఎస్సై అందె పరదేశీ వివరించారు. రౌడీ షీట్ల జాబితాను పరిశీలించి పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో క్షేత్ర స్థాయిలో శాస్త్రీయంగా వ్యవహరించాలని ఆదేశించారు.

వరద ముంపు గ్రామాల్లో కలెక్టర్ పర్యటన


అప్పనరామునిలంకలో వరద నీటిలో పడవపై ప్రయాణిస్తున్న కలెక్టర్

సఖినేటిపల్లి: మండలంలోని వరద ముంపు గ్రామాలైన టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక గ్రామాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శనివారం పర్యటించారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి అప్పనరామునిలంకకు కలెక్టర్ పడవలో వెళ్లి మరీ వరద పరిస్థితులను పరిశీలించారు. టేకిశెట్టిపాలెం పరిధిలోని అగ్నికుల క్షత్రియ కాలనీ, అప్పనరామునిలంక పరిధిలోని ఓఎన్జీసీ కాలనీని చూశారు. వరదలో పడవలపై రాకపోకలు సాగిస్తున్న బాధితులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ఏటిగట్టు వద్ద కొంత మంది రైతులు కలెక్టర్‌ను కలసి, ధాన్యం సొమ్ములు తమ ఖాతాలకు త్వరితగతిన జమ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి అప్పనరామునిలంక నుంచి ముంపు నీటిలో అత్యవసర వైద్యసేవలకు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని సదరు గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే లంక గ్రామాలలో 2020–21 వరదలకు గురైన ముంపు బాధితులకు భోజనాలకు, గ్రూపు నావలకు, వివిధ సౌకర్యాలకు గాను బకాయిలు ఉన్న రూ.37 లక్షలు విపత్తు నిధులు ఇంత వరకూ అధికారులు చెల్లింపులు చేయలేదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై తగు పరిశీలన చేస్తామని కలెక్టర్ తెలిపారు. వెంట మండల ప్రత్యేకాధికారి సిద్దార్థన్ వర్థన్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, తహసీల్దారు సీహెచ్ పెద్దిరాజు, ఏవో పీవీ నరసింహరావు, ఏపీవో నాగ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శిరీష, కార్యదర్శి గంగరాజు, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్సై ఎస్.రాము, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, విస్సా తాతయ్య నాయుడు, తాడి సత్యనారాయణ, బర్రే శ్రీను పాల్గొన్నారు. ఇదిలా ఉండగా టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద వరద బాధితులకు ప్రభుత్వ పరంగా సమకూర్చిన ఫుడ్ ప్యాకెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు.

నోట్ పుస్తకాల పంపిణీ


ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో నోట్ పుస్తకాలు అందజేసిన ప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: ధీరూభాయ్ అంబానీ రిలయన్స్ గ్రూపు గాడిమొగ మేనేజర్ సీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండలంలోని 13 పాఠశాలల్లోని పేద విద్యార్థులకు 1300 నోట్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ సీనియర్ అసిస్టెంట్ సూరపురెడ్డి వెంకన్నబాబు సూచన మేరకు జరిగిన ఈ పంపిణీలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొడమంచిలి శ్రీపాపాజీ, ఉపాధ్యాయుడు నాళం శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయుడు టీవీఎస్ తిలక్‌బాబు ఆయా పాఠశాలలకు వెళ్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోట్ పుస్తకాలు అందజేశారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ కూరగాయల మార్కెట్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ద్రాక్షారామ పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన తొట్టా వీరభద్రరావు యానం నుంచి మద్యం తీసుకుని వచ్చి విక్రయిస్తున్నాడు. తమకు అందిన సమాచారం మేరకు ద్రాక్షారామ పోలీసులు తనిఖీలు చేసి అతని నుంచి రూ.3,676 విలువైన 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గెల్లా సురేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంటువ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు

ఆలమూరు: సీజనల్ దృష్ట్యా సంభవించే మలేరియా, డెంగీ, డయేరియా తదితర అంటువ్యాధి నివారణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలను చేపట్టింది. అందులో భాగంగా మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ప్రధాన వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్య సిబ్బంది గ్రామ శివార్లలో నివసిస్తున్న కార్మికులకు శనివారం ప్రత్యేక వైద్యసేవలను అందించారు. ఇటుక బట్టీలు, రైసుమిల్లులు, పేపరు మిల్లులో పనిచేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి వైద్య సిబ్బంది వెళ్లి అంటువ్యాధులు సోకకుండా తీసుకోవలసిన చర్యలపై కార్మికులకు అవగాహన కల్పించారు. మధుమేహం, రక్తపోటు, మలేరియా, రక్త నిర్ధారణ తదితర పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమైతే సత్వరమే సమీప పీహెచ్‌సీని సందర్శించి రక్తపరీక్షలు చేయించుకుని మెరుగైన చికిత్సను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్రహారతి, కుంభహారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం తులాభారంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.